క్లుప్తంగా

విజయ గణపతికి అభిషేకాలు


అభిషేక గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అర్చకులు స్వామి వారికి పాలతో అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

7న నవరాత్రి దీక్షాధారణలు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల ఏడో తేదీన నవరాత్రి దీక్షా మాలా ధారణ గణేషులకు వేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఇప్పిలి హరనాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు చవితి పూజ, మహానైవేద్యం, అష్ట ద్రవ్యములతో గణపతి హోమం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆరో తేదీన ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను ఉదయం పది గంటల నుంచి పంపిణీ చేస్తామన్నారు.

కల్యాణికి సత్కారం


కల్యాణిని సత్కరిస్తున్న శంకర్ ఫౌండేషన్ నిర్వహికులు

రణస్థలం: అత్యుత్తమ సేవలందించిన నేత్ర వైద్యసహాయకురాలు సురాల కల్యాణికి విశాఖ పట్నం శంకర్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ నిర్వాహకులు ఆత్మకూరి కృష్ణ కుమార్, జీఎం రాధాకృష్ణన్ సోమవారం ఘనంగా సన్మానించారు. రణస్థలం మండల కేంద్రంలోని బ్రహ్మణవీధిలో ఉంటున్న కల్యాణి గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు నేత్ర వైద్య శిబిరాల నిర్వహించి 300 మంది రోగులకు కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు సహకరించినందున సత్కరించారు.

నంది పురస్కారానికి ఎంపిక




గార: గార మండలం జొన్నలపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ పండాకు అరుదైన గౌరవం దక్కింది. కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవాల సంస్థలు నంది పురస్కారానికి ఎంపిక చేశాయి. ఈ విషయాన్ని సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు బాషాదినోత్సవాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని విజయవాడ బాలోత్సవ భవన్‌లో పండాకు పురస్కారం అందజేయనున్నారు. ఆధ్యాత్మిక, సినీ, జానపద గాయకుడిగా అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా పురస్కారానికి ఎంపికయ్యారు.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి


చిలకపాలెంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను లబ్ధిదారులు పూర్తిచేయాలని ఎచ్చెర్ల మండల గృహనిర్మాణ శాఖ ఏఈ ఉరిటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. చిలకపాలెం, ఎచ్చెర్ల, ముద్దాడ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మంగళవారం పరిశీలించారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా 1279 ఇళ్లను పూర్తిచేయటమే లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకుని లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పాత బిల్లుల బకాయిల జాబితాలు సైతం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల గుర్తింపు


మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

గార: మండలంలోని వంశధార నది తీర ప్రాంతంలో ఆరు వరద ముంపు ప్రాంతాలను గుర్తించినట్టు తహసీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. వాయుగుండం ప్రభావంతో వంశధార నదికి లక్షా 10 వేల క్యూసెక్కులు నీరు వచ్చే అవకాశం ఉందన్న సూచనలతో ముందస్తు చర్యల్లో భాగంగా వరద నీరు వెళ్లే గ్రామాలను గుర్తించేందుకు మంగళవారం సమీక్ష నిర్వహించారు. బూరవెల్లి, అంబళ్లవలస, శాలిహుండం, గార, వమరవల్లి, కళింగపట్నం గ్రామాలను గుర్తించామని చెప్పారు. ఆయా ప్రాంతాలను వంశధార ఇంజినీరింగ్ అధికారులు, సర్వేయర్, వీఆర్వోలతో కలిసి పరిశీలించారు.

● గణపతి విగ్రహాల పంపిణీ



వినాయక చవితిని పురస్కరించుకొని శ్రీకాకుళంలోని మొండేటివీధిలో ఉన్న లక్ష్మీ గణపతి ఆలయంలో షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక మూర్తులను మంగళవారం పంపిణీ చేశారు. దీనితో పాటు చవితి పూజా పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కర్రా భాస్కరరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

● అన్నదానానికి విరాళం



రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి అరసవల్లికి చెందిన బంకుపల్లి చిరంజీవి రూ.20 వేలు విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంఘం కార్యదర్శి ఫాల్గుణరావుకు మంగళవారం అందజేసినట్టు జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. దాతను రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు అభినందించారు.

–శ్రీకాకుళం కల్చరల్

● పచ్చదనం..



జి.సిగడాం మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డీస్ ఫౌండేషన్ వారు అందజేసిన మొక్కలను వైద్యాధికారి బి.యశ్వంత్, సీహెచ్ఓ శివప్రసాదరావు, సిబ్బంది ఆస్పత్రి ఆవరణలో నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

– జి.సిగడాం

కళామతల్లికి సలామ్..

- ఐదున్నర దశాబ్దాలుగా కళారంగంలో తరిస్తున్న లలితశ్రీ కళాసమితి
- వేలాది నాటికల ప్రదర్శనతో గుర్తింపు
- నేడు 56వ ఆవిర్భావ దినోత్సవం



నేడు ప్రదర్శించనున్న 'మతమా? మానవత్వమా?' నాటిక ఆహ్వాన పత్రిక


గతంలో లలితశ్రీ వారు ప్రదర్శించిన ఓ నాటక దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సమాజంలోని మంచి చెడులను, అన్యాయాలను ఎత్తి చూపేందుకు చక్కటి వేదిక నాటకం. పౌరాణిక నాటకాలు పురాణగాథలకు ప్రతి రూపాలు కాగా, సాంఘిక, జానపద నాటకాలు వర్తమాన సమస్యలకు దర్పణాలు. ఇలాంటి వాస్తవ రూపాణానికి ప్రతిరూపంగా నిలుస్తోంది శ్రీకాకుళంలోని లలితశ్రీ కళాసమితి. 1967 కాలంలో కొద్దిమంది కళాకారుల కృషితో ఇది ఏర్పడింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నాటక పోటీలలో పాల్గొని మంచి పేరు ప్రఖ్యాతలు పొందింది. ఐదున్నర దశాబ్దాల తన ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చారు. నేటి శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్యకు మాతృ సంస్థగా దీన్ని చెప్పవచ్చు. కళాకారుల సంక్షేమం కోసం అందులోని వ్యక్తులు సమాఖ్యను ఏర్పాటు చేశారు. అయితే చాలా కాలంగా లలితశ్రీ కళాసమితి ప్రదర్శనలు లేక, టీవీ మాధ్యమాలతో మూలనపడింది. దీన్ని మళ్లీ పునరుద్ధరించాలనే సంకల్పంతో అందులోని సభ్యులు మంగళవారం సాంఘిక నాటక ప్రదర్శనతో పునఃప్రారంభిస్తున్నారు.

లలితశ్రీ 56 ఏళ్ల ప్రస్థానం ఇలా..

1967లో ఉగాది పర్వదినాన లలితశ్రీ కళాసమితి ఏర్పడింది. ఉరిటి భార్గవీప్రసాద్ ఊహకు ప్రతిరూపంగా ఆయన మేనమామ బలివాడ కూర్మప్రసాద్ అండదండలతో డాక్టర్ ఎల్.సూర్యలింగం అధ్యక్షతన పట్టణంలోని బలగవీధిలోగల బోడెమ్మ కోవెల వద్ద ఉన్న కూర్మప్రసాద్ స్వగృహంలో శ్రీకారం చుట్టారు. తొలినాటిక ప్రదర్శనగా కప్పగంతుల మల్లికార్జున రావు రచించిన 'నీలినీడలు'నాటకాన్ని చిగిలిపల్లి శ్యామలరావు దర్శకత్వంలో దసరా విజయదశమి పర్వంలో బోడెమ్మ కోవెల ప్రాంగణంలో భారీ స్టేజ్ వేసి, సెట్టింగులతో ప్రదర్శన ఇచ్చారు. ఆ నాటక ప్రదర్శనను ప్రముఖ నటులు జేవీ సోమయాజులు, నటరాజ కళాసమితి సభ్యులు తిలకించి కుర్రాళ్లు బాగా చేశారని ప్రశంసించారు. దీంతో సంస్థ సభ్యులకు మరింత ఉత్సాహం చేకూరింది. నీలినీడలు నాటకం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో పరిషత్‌లలో పాల్గొని అనేక బహుమతులను సాధించింది. నాటి నుంచి అగ్రగామి నాటక సంస్థగా నిలిచింది. తరువాత తులసి తీర్థం, నీడలేని ఆడది, నిజం కాటేసింది, టెలిఫోన్, దొంగరారోస్తున్నారు స్వాగతం చెప్పండి', చారిత్రక చరిత్ర ఉన్న 'రఘుపతి రాఘవ రాజారాం', వంటి నాటకాలతో ప్రేక్షక హృదయాలను దోచుకున్నారు.

నాటక పరిత్‌ల నిర్వహణ

1972, 73లలో పద్మశ్రీ నాగయ్య నాటక కళా పరిషత్తు, 1974లో పద్మశ్రీ నాగయ్య, బాబూరావు స్మారక నాటక కళాపరిషత్ పేరిట రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించారు. 1969లో లలితశ్రీ ఆర్కెస్ట్రాను కూడా అనుబంధంగా ఏర్పాటు చేసి దాని ద్వారా 15 ఏళ్ల సాంఘిక నాటకాలకు సంగీత సహకారాన్ని అందించారు. టీవీల ప్రభావంతో నాటకాలకు తగ్గిన ఆదరణతో ఈ సంస్థ ద్వారా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్యను ఏర్పాటు చేసి కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. మళ్లీ నాటి వైభవం కోసం ప్రేక్షకుల ముందుకు ఈనెల నాలుగో తేదీన శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు సాయంత్రం పలు ప్రదర్శనలను సమితి సభ్యులు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా 'మతమా? మానవత్వమా?' సాంఘిక నాటికను ప్రదర్శిస్తారు. దీన్ని కంచెర్ల సూర్యప్రకాశరావు రచించగా ఎల్.రామలింగస్వామి దర్శకత్వం వహించారు. ఇందులో ఆర్.బోసుబాబు, కేశిరెడ్డి రాజేశ్వరి, గుత్తు రవిబాబు, ప్రసాద్ రౌలో, బొడ్డేపల్లి లక్ష్మణరావు, పూతి కామేశ్వరరావు నటిస్తున్నారు. సాంకేతిక సహకారం సంగీతం పి.లీలామోహన్, రంగాలంకరణ, ఆహార్యం, లైటింగ్ సింగురు రమణారావు అందిస్తున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


తమ్మినాయుడుపేటలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులను క్షేత్రస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎచ్చెర్ల మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల, ముద్దాడ, తమ్మనాయుడుపేట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. వర్షాలు విస్తారంగా పడటం వల్ల గ్రామాల్లో అంటు వ్యాధులు, జ్వరాలు, డయేరియా వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, కాలవుల్లో పూడికలు తొలగించాలని, రోడ్లపై నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, గ్రామాల్లో జంగిల్ క్లియరెన్స్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ ఆర్.రమాదేవి, పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పీవీ దేవి పాల్గొన్నారు.

వినాయక మండపాల పరిశీలన


మండపాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని విశాఖ ఏ, బీ కాలనీల్లో నిర్మితమవుతున్న వినాయక మండపాలను శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ వాసుదేవరావుతో పాటు విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది మంగళవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సింగిల్ విండో పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చామన్నారు. మండపాలు ఏర్పాటు చేయాలనుకున్న వారు ఆ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులకు సహకరించాలని కమిటీ సభ్యులకు సూచించారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా సుధీర్‌కుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా ఉన్న చల్లా ఓబులేసును ప్రభుత్వం బదిలీ చేసింది. ఈయన స్థానంలో నియమితులైన దుర్గాప్రసాదరావు విధుల్లో చేరలేదు. దీంతో ఉన్నతాధికారులు సుధీర్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

విపత్తుల నిర్వహణలో లైఫ్ సేవింగ్ పాత్ర కీలకం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లైఫ్ సేవింగ్ స్పోర్ట్స్ సంఘ ప్రతినిధులు


శ్రీకాకుళం న్యూకాలనీ: విపత్తుల నిర్వహణలో లైఫ్ సేవింగ్ పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. లైఫ్ సేవింగ్ ప్రక్రియను గురించి మంగళవారం లైఫ్ సేవింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ వెంకట్, జాతీయ స్విమ్మర్ ఎస్.కె.శుభాన్, జిల్లా వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి తదితరులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో నీటి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడే విధానం, పద్ధతులను కలెక్టరుకు వివరించారు. జాతీయ స్విమ్మర్ ఎస్‌కే సుభాన్ నేతృత్వంలో చేపట్టిన అనేక కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. అదనపు లైఫ్ సేవింగ్ సామగ్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రజల అవసరాల నిమిత్తం తమ సంఘ సభ్యులను వినియోగించుకోవాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సామాజిక కార్యకర్త బి.వి.ఎస్.ఎన్.రాజు, సీనియర్ స్విమ్మర్లు కిశోర్, రాజశేఖర్ ఉన్నారు.

సింగుపురంలో పొలంబడి


పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రైతులకు లాభాలు చేకూర్చడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి అన్నారు. సింగుపురం గ్రామంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన పంట దిగుబడితో పాటు మిత్రపురుగులను సంరక్షించడం, రైతుకు ఖర్చు తగ్గించి లాభాలు చేకూర్చడమే పొలంబడి ఉద్దేశమన్నారు. పలువురు రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉధ్ధృతంగా బెండిగెడ్డ ప్రవాహం


ఉధృతంగా ప్రవహిస్తున్న బెండిగెడ్డ

వజ్రపుకొత్తూరు రూరల్: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో స్థానిక బెండిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో వర్షాలు కురవడంతో వరద నీరు బెండి గెడ్డలోకి భారీగా చేరింది. దీంతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మెళియపుట్టి మండలాల్లో కురిసిన వర్షం నీరు కూడా ఈ గెడ్డలోనే చేరడంతో వరదనీరు మరింత ఉధృతంగా ప్రవహిస్తూ ఉప్పుటేరు మీదగా నువ్వలరేవు వద్ద బంగాళఖాతంలో కలుస్తుంది.

రూ. 2 లక్షలు వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలో శ్రీరాజా శ్రీనివాస మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకోవడంతో దాని పునర్నిర్మాణం కోసం పూర్వ విద్యార్థుల సంఘం నడుబిగించింది. 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు రూ.2.05 లక్షల చెక్కును సంఘ సభ్యులకు అందజేశారు.

బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న రమణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో మంగళవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావల్సిన రాయితీ బకాయిలు రూ.21,980 కోట్లు ఉన్నాయన్నారు. చెల్లింపులకు 100 రోజులు గడువు అడిగారని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు కనీసం స్పందించటం లేదన్నారు. 11వ వేతన సంఘం గడువు 2023లో ముగిసిందని, అయినా అమలు చేయలేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, ఐఆర్‌లు, ఇతర పెండింగ్ బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ 117ను రద్దు చేయాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూన శ్రీనివాసరావు, లక్ష్మణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మెట్టవలసలో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్, ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మెట్టవలసలో పలు రకాల వంటలను ప్రదర్శించారు. సంతవురిటి సెక్టర్ సూపర్ వైజర్ కుప్పిలి ఉమహేశ్వరి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై దృష్టిసారించండి


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద


సమావేశంలో పాల్గొన్న మహిళా పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: గ్రామస్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని, వారి కదలికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందించాలని మహిళా పోలీసులకు టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద సూచించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానితులను ఆరా తీయాలని, మద్యం, గంజాయి, నాటుసారా క్రయ విక్రయాలు, వినియోగం, క్రైమ్ ప్రోన్ ప్రదేశాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. సమావేశంలో సీఐలు ఉమామహేశ్వరరావు, పైడపునాయుడు, అవతారం, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ



ఓల్డేజీహోమ్‌కు సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: వాసవిక్లబ్ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకాకుళం వాసవి క్లబ్, వనిత క్లబ్బులు సంయుక్తంగా మంగళవారం నగరంలోని ద్వారాకనగర్‌లోని ఖ్యాతి ఓల్డేజ్ హోమ్‌కు, బెహరా మనోవికాస కేంద్రానికి నిత్యావసర సరకులను వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు పేర్ల మహేష్, మామిడిపాక సుధాకర్, వి.ఎస్.ఎల్.నరసింహం, మటూరు దీపక్, మామిడిపాక వెంకటరావు, గ్రంధి నాని, పట్నాల ఆనంద్ ఉన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, మండల నాయకులు నెయ్యిల మోహన్‌రావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వేతనాల పెంపునకు, గ్రాడ్యూటీ, వయోపరిమితి పెంపు, పింఛన్లను అందిస్తామని హామీ ఇచ్చిందని..అయితే ఎన్నికల సమయంలో జీవోను విడుదల చేయలేదన్నారు. అయితే కూటమి నాయకులు కూడా అదే సమయంలో ఇవే హామీలను ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ఆశ కార్యకర్తలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం పీహెచ్ వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమణమ్మ, మోహిని, భారతి, జి.క్రిష్టవేణి ఉన్నారు.